క్లుప్తంగా

వైఎస్ జగన్‌ను కలిసిన జెడ్పీటీసీలు



జగన్‌మోహన్‌రెడ్డితో జెడ్పీటీసీలు సేనాపతి సంధ్యారాణి, కాకర దేవి

యలమంచిలి రూరల్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని యలమంచిలి, ఎస్. రాయవరం జెడ్పీటీసీలు సేనాపతి సంధ్యారాణి, కాకర దేవి బుధవారం తాడేపల్లి పార్టీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. తమ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, గ్రామాల్లో తాజా రాజకీయ పరిణామాలను వారు అధినేతకు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు సేనాపతి రాము పాల్గొన్నారు.

మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నేడు

యలమంచిలి రూరల్: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం గురువారం ఉదయం 11 గంటలకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించనున్నట్టు కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అయిదు అంశాలతో కూడిన అజెండా కాపీలను వార్డు కౌన్సిలర్లకు పంపించినట్టు పేర్కొన్నారు. చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి వార్డు సభ్యులు, వివిధ శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

కేజీబీవీలో మౌలిక సదుపాయాల పరిశీలన

అచ్యుతాపురం: స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో మౌలిక వసతులు, భోజన నాణ్యత, ఇతర వసతులను వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం బుధవారం పరిశీలించింది. విద్యార్థి విభాగం అధ్యక్షుడు చదరం అప్పలనాయుడు, ధర్మిరెడ్డి సతీష్, కిలాడి గోపీ, పంచదార్ల చిన్న, కారుకొండి శ్రీను, బొడ్డేడ లిల్లీ, ధూళి వెంకి, కాండ్రేగుల కిరణ్ పాల్గొన్నారు.

పెన్షనర్ల సమావేశం నేడు

యలమంచిలి రూరల్: యలమంచిలి తాలూకా రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం సర్వసభ్య సమావేశం గురువారం మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక ఎన్జీవో హోమ్‌లో నిర్వహించనున్నట్టు సంఘం అధ్యక్షుడు చంద్రమౌళి సోమేశ్వరరావు తెలిపారు. ముఖ్య అతిథులుగా సంఘం జిల్లా అధ్యక్షుడు వి. జగన్నాథరావు, కోశాధికారి కె. సత్యారావు పాల్గొంటారని, సభ్యులందరూ సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

గంగాలమ్మ తల్లి గుడికి విరాళం



విరాళం అందజేస్తున్న భక్తులు

మునగపాక: మండలంలోని పాటిపల్లి–మంగళవరపుపేట గ్రామాల సరిహద్దులో గంగాలమ్మ తల్లి గుడి నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఆలయ నిర్మాణంలో పలువురు భక్తులు భాగస్వాములవుతున్నారు. ఇదే గ్రామానికి చెందిన యల్లపు అప్పారావు జ్ఞాపకార్థంగా అతని కుమారుడు నాగేశ్వరరావు, భారతి దంపతులు బుధవారం రూ.50 వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వరిలో యాజమాన్య పద్ధతులు



సాగుపై అవగాహన కల్పిస్తున్న జిల్లా వనరుల కేంద్రం ఏవో విజేత

మునగపాక: వరి సాగులో రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని జిల్లా వనరుల కేంద్రం ఏవో విజేత తెలిపారు. పొలం పిలుస్తోందిలో భాగంగా బుధవారం మండలంలోని ఒంపోలులో రైతులకు సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. జనుము, జీలుగ వంటి పచ్చిరొట్ట విత్తనాలను భూమిలో వేసి కలియ దున్నడం ద్వారా భూసారం పెరుగుతుందన్నారు. పురుగుల మందు పిచికారీ విషయంలో అధికారుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. నారుమడిలో జింక్ లోపం కనిపిస్తే అన్నభేది, నిమ్మ ఉప్పు కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి, రైతులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

వాహన తనిఖీలు

మునగపాక: ప్రతి ఒక్కరూ వాహన రికార్డులను అందుబాటులో ఉంచుకోవాలని ఏఎస్‌ఐ దొర కోరారు. మునగపాక మెయిన్‌రోడ్డులో బుధవారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఎటువంటి రికార్డులు లేకుండా వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ వినియోగించాలన్నారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లొద్దన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కాజ్ వే



సత్యవరం వద్ద తాండవ నదిపై కాజ్‌వే

- ధ్వంసమవుతున్న రైలింగ్
- బ్రిడ్జి నిర్మించాలని వేడుకోలు

పాయకరావుపేట: నిత్యం వందలాది మంది ప్రయాణించే తాండవ నదిపై కాజ్ వే ప్రమాదకరంగా మారింది. దాంతో వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. మండలంలో సత్యవరం గ్రామం వద్ద తాండవ నదిపై నిర్మించిన కాజ్ వేకు ఇరువైపులా రక్షణగా ఏర్పాటు చేసిన రైలింగ్ ధ్వంసమవుతున్నాయి. వాహనదారులు అతివేగంలో వచ్చి వాటిని ఢీకొట్టడం వల్ల కొన్ని పూర్తిగా ధ్వంసమయ్యాయి. దాంతో తుపాన్ల సమయంలో తాండవ నది నీరు ఉధృతంగా ప్రవహించే సమయంలో వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ఈ కాజ్‌వేపై సత్యవరం, గోపాలపట్నం, పెంటకోట గ్రామాలకు చెందిన ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. దీనికితోడు పెదరాంభద్రపురం, శ్రీరాంపురం గ్రామాలకు వెళ్లడానికి, తుని పట్టణానికి వెళ్లడానికి దగ్గర మార్గం ఇదే కావడంతో రోజూ వందలాది వాహనాలు వస్తుంటాయి.

ఇరుకుగా మారిన కాజ్ వే..

రోజూ స్థానిక కంపెనీకి చెందిన పెద్ద వాహనాలు ప్రయాణించడం వల్ల ఎదురెదురుగా వచ్చే వాహనాలు, బైక్‌లు నడిపేవారు ఇరుకు కాజ్ వే వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాజ్‌వేకు పక్కన సిమెంట్ దిమ్మల రైలింగ్ తక్కువ ఎత్తులో ఉండడం కారణంగా లారీలు, టిప్పర్లను ఎదురుగా వచ్చినప్పుడు ఏమాత్రం అజాగ్రత్త వహించినా తాండవ నదిలో పడిపోయే ప్రమాదం ఉంది. వరదలు, తుపాన్లు వస్తే మూణ్నాలుగు రోజులపాటు తాండవ నది ఉధృతి ప్రవహించడం వల్ల రైతులు, ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చుట్టూ తిరిగి 15 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. సంబంధిత అధికారులు దీనిపై దృష్టి సారించి కాజ్‌వే స్థానంలో తాండవ నదిపై బ్రిడ్జి నిర్మాణం చేపడితే కంపెనీలకు వెళ్లే వాహనాలకు, చుట్టుపక్కల రైతులకు, ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



కాజ్‌వేకు రైలింగ్ పోతున్న దృశ్యం

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం



యండపల్లిలో పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో చంద్రశేఖర్

కోటవురట్ల: పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. ఐవీ ఆర్‌ఎస్ గ్రామం యండపల్లిలో పారిశుధ్య డ్రైవ్ బుధవారం నిర్వహించారు. ఆయన వీధుల్లో పర్యటించి పారిశుధ్యం పరిశీలించారు. వీధుల్లో పేరుకుపోయిన చెత్తను తొలగింపజేశారు. డ్రైనేజీల్లో పూడిక తీయించి బ్లీచింగ్ చల్లించారు. తాగునీటి నమూనా సేకరించి ల్యాబ్‌కు పరీక్ష కోసం పంపించారు. అనంతరం మాట్లాడుతూ స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్రలో భాగంగా పారిశుధ్య మెరుగుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తడి, పొడి చెత్తలను వేర్వేరుగా పారిశుధ్య కార్మికులకు అప్పగించాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ఇళ్లు, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, వారంలో ఒక రోజు డ్రై డే పాటించి ప్లాస్టిక్ వస్తువులు, తాగేసిన కొబ్బరి బొండాలు లేకుండా చూడాలన్నారు. కార్యదర్శి రవికిరణ్, కార్మికులు ఉన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

యలమంచిలి రూరల్: యలమంచిలి 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో మెయింటెనెన్స్ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ కే రాజశేఖర్ తెలిపారు. పెదపల్లి, కొక్కిరాపల్లి, గొల్లలపాలెం, మంత్రిపాలెం, వెంకటాపురం, చిన గొల్లలపాలెం, పెద షేక్కిళ్లపాలెం గ్రామాలకు, కొక్కిరాపల్లి, మర్రిబంద, పెదపల్లి వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

రేపు అడ్డురోడ్డులో..

ఎస్.రాయవరం: కొరుప్రోలు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో టీపీ రోడ్డుకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. తిమ్మాపురం అడ్డురోడ్డు వాణిజ్య ప్రాంతంలో విద్యుత్ లైన్‌లో చెట్టుకొమ్మలు తొలగింపు, మరమ్మతులు నిమిత్తం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా ఉండబోదన్నారు.

మునగపాక: మండలంలోని చూచుకొండ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ మెయింటెనెన్స్ కండక్టర్ రీ ప్లేస్‌మెంట్‌లో భాగంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. సబ్ స్టేషన్ పరిధిలోని గణపర్తి, చూచుకొండ, నరేంద్రపురం, ఆనందపురం, కుమారపురం తదితర గ్రామాల్లో సరఫరా ఉండదన్నారు.

దివ్యాంగ బాలలకు వరం.. భవిత కేంద్రం



భవిత కేంద్ర బాలలు, తల్లిదండ్రులతో అనకాపల్లి జిల్లా సహితవిద్య సమన్వయకర్త కృష్ణంనాయుడు

పరవాడ: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, విద్యాభివృద్ధి పథకాలను భవిత కేంద్ర బాలలు సద్వినియోగం చేసుకోవాలని అనకాపల్లి జిల్లా సహితవిద్య సమన్వయకర్త బీఆర్‌వీఆర్ కృష్ణంనాయుడు సూచించారు. స్థానిక భవిత కేంద్రాన్ని ఆయన బుధవారం సందర్శించి బాలల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన తల్లిదండ్రుల అవగాహన సదస్సులో మాట్లాడుతూ తల్లిదండ్రుల భాగస్వామ్యం విద్యార్థుల ప్రగతికి ఎంతో కీలకమన్నారు. సమగ్ర శిక్ష పథకం ద్వారా భవిత కేంద్రంలో అందిస్తున్న డిజిటల్ లెర్నింగ్, ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్, ప్రత్యేక శిక్షణ, ఎస్‌ఎస్‌ఏ ద్వారా ట్రాన్స్‌పోర్టు, రీడర్ అలవెన్స్, ఎస్కార్ట్, హోమ్‌బెస్ట్ అలవెన్స్, ఫిజియోథెరపీ సేవలను వివరించారు. ది లూమోన్ స్టోర్ కంపెనీ వ్యవస్థాపకులు తమ మొదటి లాభం నుంచి దివ్యాంగ బాలలకు భోజన సదుపాయం కల్పించారు. కార్యక్రమంలో లూమోన్ స్టోర్ ఫౌండర్లు వి.కృష్ణవంశీ, వి.రాజశేఖర్, వై.ఉమామణిదీప్, టి.పవన్‌కుమార్, భవిత కేంద్ర ఉపాధ్యాయులు టి.కుమారి, జి.శ్రీనివాస్, దివ్యాంగులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం



సీసీ రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎంపీపీ అప్పలనాయుడు

పరవాడ: మండలంలో వాడచీపురుపల్లి శివారు పోలిరెడ్డిపాలెం తారకరామ కాలనీలో ఎన్టీపీసీ సీఎస్సార్ నిధులు రూ.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణాన్ని మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయితే శివారు గ్రామం పోలిరెడ్డిపాలెం ప్రజలకు అనేక విధాలుగా సౌకర్యంగా ఉంటుందని, నిధులు మంజూరు చేసిన ఎన్టీపీసీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శివలంక లక్ష్మి, ఉప సర్పంచ్ కూండ్రపు శ్రీను, స్థానిక నాయకులు కూండ్రపు అప్పారావు, రమణమూర్తి పాల్గొన్నారు.

ఆటో కార్మికుల సమస్యలపై 4న ధర్నా

కె.కోటపాడు : కూటమి ప్రభుత్వం గత ఎన్నికల సమయంలో ఆటోడ్రైవర్లకు ఇచ్చిన హామీ మేరకు వాహన మిత్ర పథకంను అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రాజాన దొరబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆటో డ్రైవర్ల సమస్యలపై వచ్చేనెల 4న అనకాపల్లిలో జరిగే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ మేరకు ధర్నా కరపత్రాలను కె.కోటపాడు, ఎ.కోడూరు, చౌడువాడ గ్రామాల్లోని ఆటో స్టాండ్ల వద్ద డ్రైవర్లతో కలిసి బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.15 వేలు చొప్పున అందిస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందని, తీరా అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఈ పథకం అమలుకు నోచుకోలేదన్నారు. మరోవైపు పోలీసుల వేధింపులు ఎక్కువయ్యాయని ఆయన ఆరోపించారు. ఏఐటీయూసీ నాయకులు జి.దేముడు నాయుడు, వేచలపు కాసుబాబు, రెడ్డి అప్పలనాయుడు, పొంతపల్లి రామారావు పాల్గొన్నారు.

సమగ్ర సస్యరక్షణపై అవగాహన



తమలపాకు పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

పాయకరావుపేట: మండలంలో ఎంఎస్ పేట, పెంటకోట గ్రామాల్లో వ్యవసాయ శాఖ అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా క్షేత్ర సందర్శన, రైతులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖ అధికారి పి.ఆదినారాయణ మాట్లాడుతూ వరి నారుమడిలో తీసుకోవల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. కొబ్బరి, తమలపాకు తోటలను సందర్శించి చీడపీడలు, సమగ్ర సస్యరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్, ఏఈవో, వీఏఏ, ఎంపీఈవో పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళాల ప్రారంభం



విరాళం అందజేస్తున్న తోటాడ సర్పంచ్ మంగవేణి

మునగపాక: ప్రతి ఒక్కరూ మరిడిమాంబ ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలని తోటాడ సర్పంచ్ దొడ్డి మంగవేణి, కోటేశ్వరరావు దంపతులు కోరారు. బుధవారం వారు రూ.25 వేల విరాళం అందజేశారు. మరిడిమాంబ ఆలయం శిథిలావస్థకు గురికావడంతో నూతనంగా ఆలయ పునర్నిర్మాణానికి పెద్దలంతా శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా సర్పంచ్ నగదు అందించి విరాళాల సేకరణకు చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మతి స్థిమితం లేని వ్యక్తి అదృశ్యం



శ్యామ్ మాజీ

పరవాడ: లంకెలపాలెం గ్రామం దాసరి వీధిలో నివసిస్తున్న మతి స్థిమితం లేని శ్యామ్ మాజీ(45) ఈ నెల 22న ఇంటి నుంచి వెళ్లి, తిరిగి రాలేదని అతని బంధువులు పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. ఒడిశా రాయగడకు చెందిన శ్యామ్ మాజీ లంకెలపాలెం దాసరి వీధిలో నివసిస్తున్నాడు. గత కొంతకాలంగా ఆయనకు మతి స్థిమితం లేదు. ఈ నేపథ్యంలో 22న ఇంటి నుంచి బయటకు వెళ్లి ఎంతకీ తిరిగి రాలేదు. చుట్టుపక్కల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో బంధువులు పోలీసులనాశ్రయించారు. వారి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నామని సీఐ మల్లికార్జునరావు చెప్పారు.

కిరాణా షాపుల వద్ద డస్ట్ బిన్‌లు తప్పనిసరి



పెదతీనార్లలో క్లోరినేషన్ పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో

నక్కపల్లి: గ్రామాల్లో కిరాణా దుకాణాల వద్ద చెత్త డబ్బాలు ఏర్పాటు చేయాలని ఎంపీడీవో సీతారామరాజు సూచించారు. బుధవారం ఆయన సిహెచ్ ఎల్‌పురం, పెదతీనార్ల, జానకయ్యపేట, చినతీనార్ల గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో కాలువల్లో పూడిక తీత, చెత్తాచెదారాలు ట్రాక్టర్లలో చెత్తను సంపద తయారీ కేంద్రాలకు తరలించడం, తడి, పొడి చెత్తలను వేరు చేయడం, తాగునీటి క్లోరినేషన్ వంటి పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా కిరాణా షాపుల వద్దకు వెళ్లి డస్ట్ బిన్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. వేర్వేరుగా డబ్బాలు ఏర్పాటు చేసి తడి, పొడి చెత్త వేయాలన్నారు. సాస్ కార్యక్రమాన్ని రోజూ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామన్నారు. దుకాణాల వద్ద చెత్త లేకుండా చూడాలన్నారు. స్వచ్ఛాంధ్రలో భాగస్వాములు కావాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. కేంద్రాల ద్వారా లబ్ధిదారులకు సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కర్రి రాజబాబు, మైలపల్లి శ్రీను, ముసలయ్య తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి కాలువల ఆక్రమణలపై ఫిర్యాదు



ఆక్రమణలపై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న చిక్కాల రామారావు

పాయకరావుపేట: మండలంలో గోపాలపట్నం రెవెన్యూ పరిధి పాటి కాలువ ఆక్రమణలు మొత్తం తొలగించాలని వైఎస్సార్ సీపీ నాయకులు డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, పార్టీ మండలాధ్యక్షుడు చిక్కాల రామారావు ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దార్ ఎస్.ఎ. మహేష్‌రావును కలిసి సమస్యను వివరించారు. కూటమి నాయకులు పక్షపాత ధోరణితో వ్యవహరిస్తూ కొంతమందిని లక్ష్యంగా చేసుకుని ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. మొత్తం ఆక్రమణలు తొలగించాలని కోరారు. గోపాలపట్నం గ్రామ సమీపాన బాట దగ్గర నుంచి కాలువ ఆక్రమణలు తొలగించి, రైతుల సాగునీటికి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కోరారు. ఆయన స్పందించి సర్వేయర్‌ను, సిబ్బందిని పంపించి ఆక్రమణలను తొలగింపునకు చర్యలు తీసుకుంటామని నాయకులకు హామీ ఇచ్చారు. జెడ్పీటీసీ లంక సూరిబాబు, గోపాలపట్నం సర్పంచ్ పన్నీరు పాపారావు, పెదరాంభద్రపురం ఎంపీటీసీ గారా చక్రవర్తి, పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బోదపాటి గోవిందు, కాకాడ కృష్ణ, చంటి తదితరులు పాల్గొన్నారు.

వరి నారులో పొడతెగులు



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి ఉమాప్రసాద్

నక్కపల్లి: వరి నారులో పొడతెగులు సోకుతున్నట్లు గుర్తించామని, దీనిపై రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. బుధవారం ఉపమాకలో మండల వ్యవసాయాధికారి ఉమాప్రసాద్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ వరి నాడుమడుల్లో అక్కడక్కడ పాము పొడతెగులు ఆశించినట్లు గమనించామన్నారు. ఈ తెగులు నియంత్రణకు హెక్సాకోన జోల్‌మందు పది లీటర్ల నీటికి 20 మిల్లీ మీటర్లు మందు చొప్పున కలిపి పిచికారీ చేయాలన్నారు. ముందు జాగ్రత్త చర్యగా ట్రైకోడెర్మా లేదా సుడోమోనాస్ వాడే విధానాలను సూచించారు. ఏవో ఉమాప్రసాద్ మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ నగదు ప్రతి రైతుకు వచ్చే నెల అందిస్తామన్నారు. రైతుల వివరాలను వ్యవసాయ శాఖ ద్వారా సమీక్షించుకోవాలన్నారు.

ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదు చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

ఎస్.రాయవరం: పీ4 కార్యక్రమాన్ని ఉపాధ్యాయులకు నిర్బంధం చేయరాదని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కర్రి ధర్మారావు కోరారు. మండలంలో వమ్మవరం, తిమ్మాపురం, చినగుమ్ములూరు, లక్ష్మీపతిరాజుపేట తదితర గ్రామాల్లో పాఠశాలలను బుధవారం ఆయన సందర్శించి, సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయ సమస్యలను గాలికొదిలేసిందన్నారు. తక్షణమే జీతాలు చెల్లించాలన్నారు. ప్రభుత్వానికి 18 రకాల సమస్యలపై నోటీస్ ఇచ్చామన్నారు. వీటి పరిష్కారం కోసం ఆగస్టు 2న జిల్లా స్థాయిలో ధర్నా చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు సునీల్, జిల్లా కౌన్సిల్ మెంబర్ గోవిందరావు, ఉపాధ్యాయులు, రమేష్, నాయుడు, శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

భూదేవిచెరువు గర్భంలోని చెట్ల వేలం వాయిదా



వేలం పాటను అడ్డుకునేందుకు పోలీసులతో వివాదానికి దిగిన ఆయకట్టు రైతులు



ముందుగా రైతులతో మాట్లాడుతున్న ఈవోపీఆర్డీ చైతన్య తదితరులు

- ఆయకట్టు రైతులు, పోలీసులకు మధ్య వాగ్వాదం
- వచ్చే నెల 13కు వాయిదా వేసిన ఈవోపీఆర్డీ చైతన్య

సబ్బవరం: మండలంలోని అయ్యన్నపాలెం గ్రామ రెవెన్యూ పరిధి భూదేవి చెరువు గర్భంలోని కలప సేకరణకు గ్రామంలో నిర్వహించిన బహిరంగ వేలం వివాదానికి దారితీసింది. చెరువు గర్భంలోని సుమారు 12 ఎకరాల్లో ఉన్న సరుగుడు తోటకు పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించిన వేలం ప్రక్రియను చెరువు ఆయకట్టు రైతులు, సాగు నీటి సంఘాల సభ్యులు అడ్డుకున్నారు. పోలీసులు రంగప్రవేశం చేయడంతో పోలీసులకు, ఆయకట్టు రైతులకు మధ్య ఉద్రిక్తతకు దారి తీసింది. రైతులు తీవ్రంగా ప్రతిఘటించడంతో వేలాన్ని వాయిదా వేస్తూ వచ్చే నెల 13న నిర్వహించనున్నట్లు ఈవోపీఆర్డీ చైతన్య ప్రకటించారు.

మండలంలో అతిపెద్దదైన భూదేవి చెరువు అయ్యన్నపాలెంలో 135.9 ఎకరాల్లో విస్తరించి ఉంది. అయ్యన్నపాలెం, మర్రిపాలెం, ఎల్లుప్పి, గుల్లేపల్లికి చెందిన సమారు 500 ఎకరాల ఆయకట్టుకు సాగునీరిస్తుంది. చెరువు ఆదాయం అయ్యన్నపాలేనికి రెండొంతులు, బోదువలస శివారు మర్రిపాలేనికి ఒక వంతుగా పూర్వీకుల నుంచి వస్తోంది. చెరువు గర్భంలో సామాజిక అటవీశాఖ అధికారులు 12 ఎకరాల్లో సరుగుడు, నీటగిరి, మద్ది, టేకు వంటి చెట్లను నాటారు. కేవలం సరుగుడు తోట విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.50 లక్షల వరకూ ఉంటుందని అంచనా. ఈ ఆదాయాన్ని అయ్యన్నపాలెం పంచాయతీకి మాత్రమే జమ చేయడం సమంజసం కాదంటూ ఆయకట్టు రైతులు అడ్డుకోవడంతో వివాదం నెలకొంది. వేలం పాటను అడ్డుకున్న వారిలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు భార్య తుంపాల పార్వతి, తుంపాల శివ, సాగునీటి సంఘం సభ్యులు కనక చంద్రశేఖర్, బలిరెడ్డి చంద్రరావు, కర్రి రాంబాబు, దొగ్గ రామకృష్ణ, అమరపిన్ని నరసింగరరావు, బంధం అప్పలస్వామి ఉన్నారు.

డొంకాడకు రోడ్డు వేయాలని గిరిజనుల ధర్నా



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గిరిజనులు, గిరిజన సంఘ నాయకులు

నర్సీపట్నం: డొంకాడ గ్రామానికి రోడ్డు వేయాలని కోరుతూ ఆదివాసి గిరిజన సంఘం 5వ షెడ్యూల్ సాధన కమిటీ ఆధ్వర్యంలో గిరిజనులు బుధవారం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సాధన కమిటీ జిల్లా గౌరవ అధ్యక్షుడు కె.గోవిందరావు మాట్లాడుతూ గిరిజనుల సమస్యలు పరిష్కారం కోసం నర్సీపట్నం సబ్ కలెక్టర్ కార్యాలయానికి ఐఏఎస్ అధికారిని నియమించాలని డిమాండ్ చేశారు. డొంకాడ గ్రామానికి రోడ్డు వేసేందుకు రూ.1.60 కోట్లు 2023లో మంజూరుతో పాటు ఫారెస్ట్ క్లియరెన్స్ కూడా ఇచ్చారన్నారు. కలెక్టర్ ప్రొసిడింగ్ అనుమతులు రాకపోవడంతో పనులు ప్రారంభించలేదని పీఆర్ అధికారులు చెబుతున్నారన్నారు. తక్షణమే పనులు ప్రారంభించాలన్నారు. రోలుగుంట మండలం, పనసలపాడు రెవెన్యూ పరిధి సర్వే నంబరు 8/1లో మాజీ సర్పంచ్‌కు ఇచ్చిన పట్టాలను రద్దు చేయాలన్నారు. ఆర్ల గ్రామం నుంచి పిత్రిగడ్డ వరకు రూ.4.10 కోట్లతో చేపట్టిన రోడ్డు పనులను మధ్యలో వదిలేశారన్నారు. వైబీ పట్నం నుంచి లోసింగి, పెద్ద గరువు రూ.2.60 కోట్లతో రోడ్డు వేసి, కల్వర్టులు వేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి చిరంజీవి, డొంకాడ గ్రామస్తులు కొండతాంబిల్లి అప్పారావు, గిరిజన సంఘం నాయకుడు చీపు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

పాయకరావుపేట డివిజన్:
9951602901
Office mail : sakshiadvtvsp@gmail.com